## క్లుప్తంగా

### ఘనంగా పౌరాణిక కళాకారుల సంఘం వార్షికోత్సవం



పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞానమందిరం వేదికగా పౌరాణిక కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘం 27వ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పౌరాణిక పద్య నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. చందనం నాయుడుచే పాండవోద్యోగం నుంచి యుధిష్టర ఏకపాత్ర, డాక్టర్ ఎ. కోటేశ్వరరావు భవానిగా, రాజనర్తకిగా కె.వనజకుమారి భవానిలోని ఒక సన్నివేశాన్ని ప్రదర్శించారు. అనంతరం సంఘ అధ్యక్షులు నల్లక శ్రీనివాసరావు అధ్యక్షతన సభా కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల నటులు ఎ.కోటేశ్వరరావు, చిట్టినేని లక్ష్మీనారాయణలకు డాక్టరేట్ బిరుదు అందుకున్న సందర్భంగా సంస్థ, నిర్వాహకులు, అతిథులు ఘనంగా సన్మానించారు. ముగింపులో సత్యహరిశ్చంద్ర పూర్తి నాటక ప్రదర్శన కళాకారుల పౌరాణిక పద్యాలతో జనరంజకంగా సాగింది. కార్యక్రమాలను సంస్థ గౌరవాధ్యక్షులు చెన్నుపాటి కృష్ణారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సనిసెట్టి సాంబశివరావు, తన్నీరు ధనారావు, బండి శ్రీకాంత్, మురుగు సూరినారాయణ, తన్నీరు రమణ, తోట శ్రీనివాసరావు తదితరులు పర్యవేక్షించారు.

### నేడు నగరపాలక సంస్థలో స్పందన

నెహ్రూ నగర్: ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమం సోమవారం జరుగుతుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడం జరుగుతుందన్నారు. సచివాలయాల్లో ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందని స్థానికంగా పరిష్కారం కాని సమస్యల పై నేరుగా తమను కలసి అర్జీలు అందజేయవచ్చని ఆమె తెలిపారు.

### ప్రొఫెసర్ రామారావుకు జీవిత సాఫల్య పురస్కారం



గుంటూరు రూరల్: ఉపాధ్యాయ వృత్తిలో తనదైన ముద్ర వేసి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గనిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి డాక్టర్ నాదెండ్ల రామారావు అని చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు అన్నారు. ఆదివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ రామారావు 2023వ సంవత్సరానికి గానూ జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. రాజమండ్రిలోని వీజే ఫార్మసీ కళాశాలలో జరిగిన పురస్కార వేడుకల్లో న్యూఢిల్లీకి చెందిన ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ దీపేంద్ర సింగ్, సౌత్ రీజియన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎం.వి. రమణ, ఈసీ సభ్యులు డాక్టర్ ఎం. రాధాకృష్ణమూర్తి, డాక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి అవార్డు ప్రదానం చేసినట్లు చెప్పారు. ఫార్మసీ ఆయన మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుభవంతో 7 పుస్తకాలు, 3 పేటెంట్‌లు, ఎన్నో ప్రచురణలు, నూతన ఆవిష్కరణలు చేశారని వివరించారు. అదేవిధంగా ఆయన ఎన్నో అవార్డులు, పొందారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్, అధ్యాపకులు అవార్డు పొందిన రామారావును అభినందించారు.

### ఆధునిక కంటి వైద్య విధానంపై అవగాహన



పెదకాకాని: ఆధునిక కంటి వైద్య విధానంపై అవగాహన సదస్సు.. కంటి వైద్య విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని కోయంబత్తూరు శంకర కంటి ఆసుపత్రి కార్నియా స్పెషలిస్ట్ డాక్టర్ జేకే రెడ్డి అన్నారు. పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి, శంకర అకాడమీ ఆఫ్ విజన్ నేతృత్వంలో ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో ఆదివారం ఆధునిక కంటి వైద్య విద్యా విధానంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జేకే రెడ్డి మాట్లాడుతూ వైద్య రంగంలోని మార్పులు, ఆధునిక చికిత్సా విధానం వైద్య విద్యార్థులకు ఉపయోగపడుతాయన్నారు. మధురై శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ మహేష్ కంటికి సంబంధించి ప్రశ్నలకు, సందేహాలకు సమాధానం ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి శంకర కంటి ఆసుపత్రి సీఈఓ డాక్టర్ సుధాకర్ పొట్టి అధ్యక్షత వహించారు. పర్యవేక్షకులుగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నుంచి డాక్టర్ వి.సోమశేఖర్, డాక్టర్ పర్నికుమార్, డాక్టర్ మోపర్తి శివప్రసాద్, డాక్టర్ రామలింగారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పలు జిల్లాల నుంచి 210 మంది నేత్ర వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన

- ప్రజా సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి జగనన్న
- దుష్టశక్తులను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- 39వ డివిజన్‌లో కోలాహలంగా "మనతో మన రజినమ్మ" కార్యక్రమం



వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

పట్నంబజారు: వైఎస్సార్ సీపీకి చెందిన ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు 39వ డివిజన్‌లో ''మనతో మన రజినమ్మ'' కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో మంత్రి పర్యటించి.. ప్రతి గడపలోనూ ప్రజలతో మమేకమైయ్యారు. తీన్‌మార్ డప్పులు.. డీజే సౌండ్‌లతో.. యువత భారీ బైక్ ర్యాలీ.. ప్రజల చేతి నుంచి జాలువారుతున్న పూలవర్షంతో మంత్రి రజిని పర్యటన ముందుకు సాగింది. బాణసంచా పేలుళ్లతో పండుగ వాతావరణం కనిపించింది.

ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పరితపించే వ్యక్తి సీఎం జగన్ అని, ఆయన అనుకుంటే నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్ అని చెప్పారు. వైనాట్ 175 ధీమా వెనకాల నాలుగున్నరేళ్ల సంక్షేమ వెల్లువ ఉందని, నిస్వార్థంగా పేదల కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో తొలిసారి సామాజిక న్యాయం అనేది నినాదం కాదని, అమలు చేయాల్సిన విధానమని జగనన్న చాటి చెప్పారన్నారు. సీఎం జగనన్న పేదవాడి గుండె చప్పుడుగా నిలబడితే.. చంద్రబాబు నాయుడు పెత్తందార్ల వైపు నిలబడ్డారని, ఈ యుద్ధంలో పేదలు గెలవాలంటే, వారి జీవితాలు బాగుపడాలంటే మన రాష్ట్రానికి తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**దుష్ట చతుష్టయానికి బుద్ధి చెప్పాలి**

వచ్చే ఎన్నికల్లో దుష్ట చతుష్టయానికి తగిన విధంగా బుద్ధి చెప్పాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందన్నారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసే సీఎం జగన్‌ను తిరిగి గెలిపించుకోవాలని, జగనన్న చేసిన మంచిని గడపగడకూ వెళ్లి ప్రచారం చేయాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. జగనన్న మళ్లీ అధికారంలోకి వస్తే పేదలకు ఎంతో మేలు జరుగుతుందని, బడుగు, బలహీన వర్గాల్లో మనోధైర్యాన్ని నింపిన నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని తెలిపారు. గుంటూరు నగరం అభివృద్ధి దిశగా సాగుతోందని, మళ్లీ అధికారం ఇస్తే మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా సీఎం జగన్ ముందుకు సాగుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను తిరిగి సీఎంను చేసుకోవటం ద్వారా రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసువెళ్ళవచ్చన్నారు. కార్యక్రమంలో డివిజన్ ముఖ్యనేత మార్కెట్ బాబు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, మండల జేసీఎస్ అధ్యక్షులు పాల్గొన్నారు.



యువకులు భారీ బైక్ ర్యాలీ

# సంస్కృతిని చాటే పెద్ద పండుగ సంక్రాంతి

**ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు**

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను చాటే పెద్ద పండుగ సంక్రాంతి అని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు పేర్కొన్నారు. కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గిరిధర్‌రావు మాట్లాడుతూ తెలుగు వారి పండుగల్లో సంక్రాంతికి ప్రత్యేకమైన స్థానముందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు సంక్రాంతి శోభతో కళకళలాడుతాయని, ఉద్యోగాల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన వారందరూ సొంత ఊరికి వచ్చి కుటుంబ సమేతంగా ఆనందోత్సాహాలతో జరుపుకునే పండుగ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో అందమైన రంగవల్లులను తీర్చిదిద్ది, సరస్వతీ దేవి పూజ, భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు, బొమ్మల కొలువు, హరిదాసుల పాటలతో పాటు సంక్రాంతి పిండి వంటకాలను తయారు చేసి అతిథులకు వడ్డించారు. కాంతారా, జానపద నృత్యాలతో విద్యార్థినీ, విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కోశాధికారి మాజేటి ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.హేమాంబ, హెచ్ఎం కృష్ణ ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావును సత్కరిస్తున్న మాజేటి ప్రసాద్, హేమాంబ



విద్యార్థినుల నృత్యాలు

**అన్నదాన సమాజంలో 12, 13న..**

పాత గుంటూరు: సంక్రాంతి పురస్కరించుకుని అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఈ నెల 12, 13 తేదీలలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. 12న సాయంత్రం 5 గంటలకు ప్రముఖులు బీళాల అశోక్, ఎస్.ఎస్. సుబ్రహ్మణ్యంలకు సత్కారం, 7 గంటలకు ప్రక్షాళన (నాటిక) చీకట్లో చిందులాట హాస్యనాటిక, 13న ఉత్తమ 5 గంటలకు ఉపాధ్యాయుడు మేకల పురుషోత్తమ ప్రసాద్‌కు సన్మానం, 6 గంటలకు మధుర గీతాల సంగీత విభావరి జరుగుతాయని సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగి, సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కారాలు చూపాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆదివారం బృందావన్‌గార్డెన్స్‌లోని జీఎస్ఆర్ పబ్లిక్ స్కూల్లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సంబరాలను ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గాలను శాస్త్రవేత్తలే కనుగొన్నారని తెలిపారు. డాక్టర్ పోసాని శ్రీనివాస్ మాట్లాడుతూ చదువుకున్న వారు సైతం శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండటం లేదని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకుని మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి 36 విద్యార్థి బృందాలు పోటీపడిన చెకుముకి సైన్స్ క్విజ్‌లో ప్రభుత్వ విభాగం నుంచి గొట్టిపాడు, మందడం జెడ్పీ హైస్కూల్స్, మంగళగిరిలోని బీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్, ప్రైవేటు పాఠశాలల విభాగంలో కొండవీడు పబ్లిక్ స్కూల్, సీఆర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెయింట్స్ ఆన్స్ స్కూల్ టీంలు మొదటి మూడుస్థానాల్లో విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో జనవిజ్ఞానవేదిక జిల్లా నాయకులు డాక్టర్ ఏఎస్ ప్రసాద్, టి.జాన్‌బాబు, బి. ప్రసాద్, షేక్ అహ్మద్ హుస్సేన్, టీఆర్ రమేష్, చాందిని, బి. ఉదయ్‌భాస్కర్, బి. శంకర్‌సింగ్, ఇ. రాధ, కె. సాయిచ ఎం. కోటేశ్వరరావు, వీరనారాయణ, జి. వెంకట్రావు, సస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



సైన్స్ పోటీల బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, జేవీవీ నాయకులు

### దుగ్గిరాలలో ఇంటింటికీ రక్తపూతల సేకరణ

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామంలో బోదకాలు వ్యాధి నిర్ధారణకై రక్తపూతల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం మాట్లాడుతూ బోదవ్యాధి నిర్ధారణకు రాత్రి సమయంలో రక్తపూతల సేకరణ చేయాలని అలా చేస్తే మానవ రక్తంలో ఉన్న మైక్రో ఫైలేరియా క్రిమిని గుర్తించవచ్చని, తద్వారా బోదకాలు వ్యాధి రాకముందే మందులను వాడడం ద్వారా ఈ వ్యాధిని సమూలంగా నిర్మూలించవచ్చని వివరించారు. ప్రజలందరూ రాత్రిపూట సేకరించే ఈ రక్తపూతల సేకరణ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్ రెడ్డి, తెనాలి మలేరియా సబ్ యూనిట్ అధికారి వంగల పున్నారెడ్డి, ఆరోగ్య విద్యాబోధకులు వంకదార సుబ్బారావు, సూపర్‌వైజర్ ఖాజా, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసరావు, నటరాజ్, వార్డ్ హెల్త్ సెక్రటరీ లీలాకుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగిన విజయ సంకల్ప యాత్ర

గుంటూరు మెడికల్: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ వల్లూరు జయప్రకాష్ నారాయణ ఆధ్వర్యంలో జరుగుతున్న బిజెపి విజయ సంకల్ప యాత్ర ఆదివారానికి ఐదో రోజుకు చేరుకుంది. ముఖ్య అతిథులుగా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేసి మాట్లాడారు. చిగురుపాటి కుమారస్వామి, షేక్ బాజీ మాట్లాడుతూ విజయ సంకల్పయాత్ర పేరుతో వల్లూరు జయప్రకాష్ నారాయణ చేస్తున్న యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో గుంటూరు జిల్లాకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నట్లు వెల్లడించారు. వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ప్రధాని మోడీ ఆధ్వర్యంలో దేశానికి చేసిన పథకాలు ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవడమే ధ్యేయంగా ప్రజా యాత్ర సాగిస్తున్నామని చెప్పారు. యాత్రలో భాగంగా స్థానిక అరండల్ పేట పదోలైన్ ఠాగూర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కొండా వెంకటప్పయ్య పంతులు సమాధికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మరణించిన బీజేపీ నేతలు గోవిందరాజులు లక్ష్మీ నరసింహారావు, అమ్మిశెట్టి ఆంజనేయులు, పాటిబండ్ల కృష్ణ కుమార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు, ఈదర శ్రీనివాసరెడ్డి, కుమార్ గౌడ్, చెరుకూరి తిరుపతిరావు, పెమ్మరాజు సుధాకర్, వెలగలేటి గంగాధర్, నాగమల్లేశ్వరి, తదితర నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కేంద్ర పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న బీజేపీ నేతలు

# విషాహారంతోనే అనారోగ్య సమస్యలు

**అవగాహన సంస్థ ఆధ్వర్యంలో చర్చలో వక్తలు**

లక్ష్మీపురం: పోషకాల్లేని ఆహారంతో దేశ ప్రజలు నిస్సత్తువుగా కూలబడుతున్నారని తినే తిండి ప్రాణ గండంగా పరిణమిస్తున్న దురవస్థ నుంచి ప్రజల్ని బయటపడేయడానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాల్సి ఉందని డైటీషియన్ ఎస్. భిక్షపతి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చర్చలో ఆయన మాట్లడుతూ ఆహార ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించామని చంకలు గుద్దుకుంటన్న ప్రభుత్వాలు రసాయనిక ఎరువుల విచ్చలవిడి వినియోగాన్ని నియంత్రించలేక పోవడంతో దేశీ ఆహారం పోను పోను సారహీనంగా మారుతోందన్నారు. 1960లతో పోలిస్తే నేడు దేశంలో వరి, గోధుమ, వంగడాల్లో కాల్షియం, ఇనుము, జింకు వంటివి పూర్తిగా తగ్గి పోయాయన్న కఠోర వాస్తవాన్ని ఇటీవల అధ్యయనం వెలుగులోకి తెచ్చిందన్నారు. ఎముకలు, నరాల పట్టుత్వానికి వ్యాధి నిరోధకతకు ప్రాణప్రదమైన ఖనిజాలు మన ప్రధాన ఆహార పంటల్లో కొరవడం తీవ్రంగా కలవరపరిచే విషయమన్నారు. ప్రముఖ యోగాచార్యులు అచ్చుత ఇందుశేఖర్ మాట్లాడుతూ కేజీ అరవై రూపాయలకి పైగా పెట్టి కొన్న బియ్యంతో చేసిన అన్నం తిన్నా ఉపయోగం ఉండటం లేదన్నారు. పిప్పి తిన్నట్లే ఉందని, బలవర్ధకమైన పోషకాహారం తినే స్థితి లేక దేశ వ్యాప్తంగా ఏటా లక్షల మంది అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అన్నదాతలు సేంద్రియ సేద్యం వైపు అడుగులు వేసేలా ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలన్నారు. తృణధాన్యాల వాడకాన్ని విస్తృతం చేసే వ్యూహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సానపట్టాలన్నారు. అనంతరం చర్చలో ఇంజినీర్ ఎస్.సదాశివం, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం ప్రసంగించారు.



మాట్లాడుతున్న డైటీషియన్ ఎస్.భిక్షపతి, పక్కన సంస్థ సభ్యులు

# 12 నాటికి అందరికీ పట్టాలు పంపిణీ

**టిడ్కో ఎస్.ఈ. చిన్న కోటేశ్వరరావు**

నెహ్రూనగర్: టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ వేగంగా జరుగుతుందని, జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు ఈ నెల 12 నాటికి పూర్తిస్థాయిలో అందరికీ పట్టాలు అందించడంతోపాటు, ఫ్లాట్ తాళాలు కూడా అందిస్తామని టిడ్కో ఎస్.ఈ. చిన్న కోటేశ్వరరావు వెల్లడించారు. ఆదివారం అడవితక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో 10 బ్లాక్‌ల్లో లబ్ధిదారులకు పట్టాలు, ఫ్లాట్ తాళాలు అందించారు. ఎస్.ఈ. మాట్లాడుతూ గుంటూరు అర్బన్ పరిధిలోని టిడ్కో గృహ సముదాయాలను శనివారం ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ప్రారంభించారని, లబ్ధిదారులకు పట్టాలను రోజువారీ షెడ్యుల్ మేరకు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అడవి తక్కెళ్ళపాడులోని 101 బ్లాక్ లకు సంబంధించి 300 చదరపు అడుగుల ప్లాట్‌లు ఆదివారం 10 బ్లాక్‌ల లబ్ధిదారులకు పట్టాలు అందించామని, ఈ నెల 12 నాటికి పట్టాల పంపిణీ పూర్తి అవుతుందని తెలిపారు. మంగళవారం నుంచి 365, 425 చదరపు అడుగుల ప్లాట్‌లను బ్లాక్‌ల వారీగా క్రమపద్ధతిలో అప్పగించడం చేస్తామన్నారు. పట్టాలు పొందిన లబ్ధిదారులు తగిన వివరాలతో విద్యుత్ మీటర్ కోసం దరఖాస్తు చేసుకుంటే వేగంగా ఇవ్వడానికి ఆ శాఖ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. టిడ్కో ఇళ్లు మంజూరై, పట్టా రాని వారు అడవి తక్కెళ్లపాడులోని టిడ్కో గృహ సముదాయంలో నగరపాలక సంస్థ, టిడ్కో అధికారులు అందుబాటులో ఉంటారని, వారిని కలిసి వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఈ.ఈ. ప్రసాద్, జీఎంసీ మేనేజర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

పాత గుంటూరు: 'మార్గశిర ధనుర్మాస ఏకాదశి' పర్వదినం సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కళ్యాణ వేదికపై ఆలయ పాలకమండలి, భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో విశ్వ శ్రేయస్సును కాంక్షిస్తూ (108 పర్యాయాలు) శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, ఆలయ అధ్యక్షులు సి.హెచ్. మస్తానయ్య, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన గురువులు కె.వి కోటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

- ధార్మిక ప్రాంగణంలోని యాగశాలలో 'భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్' ఆధ్వర్యంలో 13 మంది రుత్వికులతో శ్రీ చండీ పారాయణ, భక్తులచే' శ్రీ లలితా సహస్రనామ పారాయణ' నిర్వహించారు.ప్రముఖ ఆధ్యాత్మికులు నంబూరు సాంబశివరావు ఆధ్వర్యంలో రమాదేవి చక్ర కుంకుమ' పూజ నిర్వహించారు.

# అవోపా సామాజిక సేవలు అభినందనీయం

**వాసవీక్లబ్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ గుడిపాటి వెంకట భాస్కరరావు**

గుంటూరు ఎడ్యుకేషన్: పేద ప్రజలకు అవోపా అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని వాసవీక్లబ్ ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ గుడిపాటి వెంకట భాస్కరరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కార్యాలయంలో ఆదివారం 108 మంది పేద వృద్ధులకు రూ.500 చొప్పున పెన్షన్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాస్కరరావు మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు అవోపా చేస్తున్న కార్యక్రమాలకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇండియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎస్ఎన్‌డీ మల్లేశ్వరరావు మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న తీరును అభినందించారు. సీఏ పొట్టి నరేంద్ర మాట్లాడుతూ అవోపా ద్వారా వివాహ పరిచయ వేదికలతో పాటు సివిల్స్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. ఈసందర్భంగా పేదలకు తుమ్మలపల్లి చంద్ర భాస్కరరావు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, గుంటూరు శాఖ అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, సభ్యులతో పాటు జనార్ధనరావు, మట్టుపల్లి రవి కుమార్ పాల్గొన్నారు.



పేదలకు పెన్షన్, నూతన వస్త్రాలు అందజేస్తున్న జీవీ భాస్కరరావు, మల్లేశ్వరరావు, అవోపా ప్రతినిధులు

### సీపీఐ నేత మారయ్య మృతి

తాడికొండ: పొన్నెకల్లు గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు పొదిలి మారయ్య(90) ఆదివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉంటూ ఇంటికే పరిమితమైన ఆయన ఆదివారం తుదిశ్వాస విడిచారు.

# ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు




ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో సంస్కార భారతి అధ్యక్షులు ఇంద్ల శ్రీధర బాబు ఆధ్వర్యంలో భరతమాత పూజోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగంలో నిర్వహించిన కూచిపూడి బృంద నృత్య ప్రదర్శనలు కనుల పండువగా జరిగాయి, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలయ అధ్యక్షులు సి. హెచ్.మస్తానయ్య పాల్గొని జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలు, భారత దేశ చిత్ర పటం వేయటం వంటి పోటీలలో పలు ప్రాంతాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు.

# 12న ఉచిత మెగా వైద్యశిబిరం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో ఈనెల 12న మెగా ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు చిట్టా ఈశ్వరసాయి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ సీహెచ్ భరద్వాజరెడ్డి అన్నారు. ఈసందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ చిట్టా ఈశ్వరసాయి పదకొండవ వర్ధంతి సందర్భంగా శంకరకంటి నేత్రవైద్యులచే కంటిపరీక్షలు నిర్వహించి ఆపరేషన్లు, మందులు అందజేస్తామని చెప్పారు. గుంటూరు తలసీ వైద్యశాల డాక్టర్ సోమశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అన్నిరకాల వ్యాధులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు జేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, జిల్లా పరిషత్ చైర్మన్ కత్తెరహెనీ క్రిస్టీనా, నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డొక్కామాణిక్య వరప్రసాద్, శాసనమండలి సభ్యుడు మర్రి రాజశేఖర్, ఆర్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్ కుమార్, ప్రభుత్వ సలహాదారుడు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, చిలుకలూరిపేట సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు పాల్గొంటారని చెప్పారు.

# ముగిసిన జేకేఏ క్యూలెవల్ కరాటే బెల్ట్ పోటీలు



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లిలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా ఎ.పి. చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి రవిబాబు, జోనల్ ఇన్‌స్ట్రక్టర్ కొడాలి సాగరిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరాటే పోటీలు ఆదివారంతో ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యాపార వేత్త చాగంటి సాగర్ చందు రెడ్డి విచ్చేసి ఉత్తీర్ణులైన వారికి బెల్ట్, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కరాటేను బ్లాక్ బెల్ట్ వరకు అయినా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ జె.కె.ఎ. క్యూలెవల్ బెల్ట్ పోటీలలో ఎ.ఐ.ఎం.ఇ.ఇ. ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు పొట్లూరి అన్వీ, పొట్లూరి అర్జున్‌లు పొందగా, చాగంటి స్నేహిత, యస్. అక్షిత, చాగంటి గోవర్ధన్‌రెడ్డిలు గ్రీన్ బెల్ట్‌ను, ఎన్.డి.ఆర్.ఎఫ్. విద్యార్థులు ఎండి అయాన్, ఎం. నికిల, వి. సాయి శరణ్‌లు ఆరెంజ్ బెల్ట్‌ను, చాగంటి స్నిగ్ధ, ఎండి అకీబ్ ఎల్లో బెల్ట్‌ను, ఎం. యషిత, యస్. శక్తి, కె. రోహినిక్ రవిరెడ్డి, ఎ. పూర్ణ తిరుమల హిమబిందు, ఎస్. అష్విత్ తేజ్, ఎ. ధవన్, ఎన్. బ్రహ్మతేజ్, యస్. వసంత ప్రియన్‌లు జూనియర్ రెడ్ బెల్టులను పొందారు.